సాక్షి
అనంతపురం

గురువారం । 19 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.




టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 37.4°/22.4°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

నిలువు దోపిడీ



ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్య ధన దాహానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. వైద్యులు డబ్బు సంపాదన కోసం రోగులకు అవసరం లేని పరీక్షలు, స్కానింగులు చేయిస్తున్నారు. రోగి ఆర్థిక పరిస్థితిని ఏమాత్రమూ పరిగణనలోకి తీసుకోకుండా నిలువుదోపిడీ చేస్తూ అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు.

- బరి తెగిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- ధనార్జనే ధ్యేయంగా టెస్టులు, స్కానింగులు
- స్కానింగ్ సెంటర్లలో వైద్యులే భాగస్వాములు
- రోగి వద్ద డబ్బు లేకపోతే ఆభరణాల స్వీకరణ
- చితికిపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

❒ వారం రోజుల క్రితం ఉరవకొండకు చెందిన ఓ మహిళ అనంతపురంలోని రామ్‌నగర్ ఫ్లై ఓవర్ సమీపాన గల ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లింది. ఆస్పత్రి యాజమాన్యం చికిత్సకు భారీగా చార్జ్ వేశారు. ఉన్న డబ్బు చాలక పోవడంతో ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు తీసుకున్నారు. తర్వాత డబ్బు కట్టి గాజులను విడిపించుకు వెళ్లినట్టు రోగి తెలిపింది.

❒ గుత్తికి చెందిన ఓ ఎనిమిదేళ్ల బాలిక చెవి నొప్పితో బాధపడుతూ అనంతపురం సాయినగర్‌లోని ఓ ఈఎన్‌టీ డాక్టర్ వద్దకు వచ్చింది. ఆ అమ్మాయికి రకరకాల టెస్టులు రాయడంతో రూ.4వేల బిల్లు అయింది. ఈ టెస్టుల్లో హెచ్‌ఐవీ టెస్టు కూడా ఉంది. దీన్నిబట్టి డాక్టరు ఎంత దారుణంగా టెస్టులు రాశారో అర్థం చేసుకోవచ్చు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో కొన్ని ప్రాణం పోసే స్థాయి నుంచి ప్రాణం తీసే స్థాయికి దిగజారాయి. కొందరు వైద్యులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే ఇక ఈ ధన దాహానికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. పేషెంటు ఆస్పత్రికి రాగానే రకరకాల టెస్టుల పేరుతో పీల్చి పిప్పి చేస్తున్నారు. తలనొప్పి అనగానే ఎంఆర్ఐ, ఛాతిలో నొప్పి అనగానే యాంజోగ్రామ్ టెస్టులు రాసేస్తున్నారు. ఇటీవల కొంతమంది బాలింతలు, రోగులు మృతిచెందిన ఘటనలు ప్రైవేటు ఆస్పత్రుల తీరుకు నిదర్శనం.

డబ్బు..డబ్బు..డబ్బు

రోగానికి, డాక్టరు రాసే టెస్టులకు సంబంధమే ఉండడం లేదు. కానీ రోగి డాక్టరును ప్రశ్నించే పరిస్థితి లేకపోవడంతో ఎంతవరకు వీలైతే అంత డబ్బు పిండుతున్నారు. ఒకవేళ ఆరోగ్యశ్రీ కింద రోగి ఆస్పత్రిలో చేరినా టెస్టుల పేరుతో చికిత్సకు ముందే రూ.10 వేల నుంచి రూ.20 వేలు లాగుతున్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్లలో డాక్టర్లే భాగస్వాములు. దీంతో ప్రతి చిన్న జబ్బుకూ ఎంఆర్ఐ, సీటీ స్కాన్ అనేది తప్పనిసరి అయ్యింది. టెస్టులకు భయపడి ఏ ఆస్పత్రికి వెళ్లాలో అర్థం కాక రోగులు సతమతమవుతున్నారు.

ఏజెంట్లుగా ఆర్ఎంపీలు

గ్రామాల్లో చాలామంది దూరం వెళ్లలేక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తుంటారు. అయితే జబ్బు ముదిరిన సమయాల్లో ఆర్ఎంపీలు అనంతపురంలోని డాక్టర్లకు రెఫర్ చేస్తారు. ఆ డాక్టరుకు, ఆర్ఎంపీకి ఎప్పటినుంచో లింకు ఉంటుంది. ఇందులో వేసే బిల్లులో కొంత పర్సెంటేజీ ఆర్ఎంపీకి వెళుతుంది. ఇలా చాలా ఆస్పత్రులకు ఆర్ఎంపీలే ఏజెంట్లుగా, ఆదాయ వనరుగా మారారు. ఆర్ఎంపీ నుంచి వెళితే ఎక్కువ సొమ్ము వసూలు చేస్తారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు	321
ఔట్‌పేషెంట్‌లు (రోజుకు)	15,000
ఇన్‌పేషెంట్‌లు (సగటు)	2,500
టెస్టులు రాస్తున్నది (సగటు)	10,000
కన్సల్టెన్సీ ఫీజు (సగటు)	రూ. 200

ఇష్టారాజ్యంగా టెస్టులు వద్దు



ఇష్టమొచ్చినట్టు టెస్టులు రాయకూడదు. రకరకాల టెస్టు కిట్‌లను దుర్వినియోగం చేయడం వల్ల మరొకరికి అవి ఉపయోగపడవు. పైగా ఇది డాక్టర్‌కు నైతికత అనిపించుకోదు. వీలైనంత వరకూ పేషెంటుకు ఖర్చు తగ్గించే చికిత్స చేయడమే డాక్టర్‌కు ఉండాల్సిన మంచి లక్షణం.

–డా.సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, హృద్రోగ నిపుణులు, ఎంసీఐ సభ్యులు

అవగాహన రావాలి



చికిత్స విషయంలో డాక్టరు రోగిని మోసం చేశారని అనిపించినప్పుడు ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన రావాలి.

– డాక్టర్ బి.సాంబశివారెడ్డి, చైర్మన్, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 43 టీఎంసీల నీరు



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ బుధవారం 43.808 టీఎంలకు తగ్గింది. 1612.99 అడుగుల వద్ద నీటి మట్టం ఉండగా ఇన్‌ఫ్లో 657, అవుట్‌ఫ్లో 10,534 క్యూసెక్కులుంది. కాలువలకు వదులుతున్న నీటితో పాటు ఆవిరి రూపంలో వారానికి 6 టీఎంసీల నీరు ఖర్చవుతోంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,670 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1632.88 అడుగులతో 105.306 టీఎంసీల నీటి నిల్వతో 39,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 28,007 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా షేకున్‌బీ ఎన్నిక



ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం


అనంతపురం: ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా యాడికి మండలానికి చెందిన షేకున్‌బీ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ ఎన్నికలు బుధవారం డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఈశ్వరయ్య, ఏపీఎం అనిత ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్ష స్థానానికి సుహాసిని, షేకున్‌బీ, షాహిద్, పర్వీన్, రుక్మిణి, హేమలత, కృష్ణమ్మ, వసంత, సావిత్ర, రాధ పోటీ చేశారు. వీరిలో షేకున్‌బీ ఏడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కార్యదర్శి స్థానానికి ఇ.రాధమ్మ, ఓబుళమ్మ, లలిత పోటీ చేశారు. వీరిలో కంబదూరుకు చెందిన ఇ.రాధమ్మ 17 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష స్థానానికి షాహీదా, రామాంజినమ్మ, టి.సుజాత, సావిత్రి, సుహాసిని పోటీ పడగా.. పామిడికి చెందిన టి.సుజాత 10 ఓట్ల మెజార్టీతో విజయం వరించింది. కోశాధికారిగా రాయదుర్గానికి చెందిన ఎం.లలిత ఎన్నికయ్యారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు



అనంతపురం ఎడ్యుకేషన్: జూనియర్ కళాశాలలకు గురువారం నుంచి ఈ నెల 25 వరకు దసరా సెలవులు ప్రకటించారు. 26న కళాశాలలు పునఃప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ ఎంవీ శేషగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు విధిగా సెలవులు అమలు చేయాలని ఆర్ఐఓ సురేష్ బాబు ఆదేశించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధనలక్ష్మీ నమోస్తుతే!



రాయదుర్గంలోని కోటలో ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత

రాయదుర్గంటౌన్: నవరాత్రి ఉత్సవాలు జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు ఉదయం, సాయంత్రం భక్తులు భారీ సంఖ్యలో తరలిచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. నాలుగో రోజు బుధవారం రాయదుర్గంలోని కోటలో నగరేశ్వరీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 20, 50, 100, 200, 500 నోట్లు దాదాపు రూ.50 లక్షలతో చేపట్టిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

నేడు 'జగనన్న చేదోడు' సాయం విడుదల

- ఉమ్మడి జిల్లాలో 25,989 మందికి లబ్ధి

అనంతపురం రూరల్: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న చేదోడు' పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏటా అర్హత కల్గిన రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారు. కులవృత్తులపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు వీలుగా పెట్టుబడి అవసరాలను తీర్చుకునేందుకు 'చేదోడు' పథకం ఉపయోగపడుతోంది. ఈ పథకం నాలుగో విడతలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి ఆర్థికసాయం జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 25,989 మందికి లబ్ధి కలగనుంది. అనంతపురం జిల్లాలో 14,795 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.14.79 కోట్లు జమ కానుంది. శ్రీసత్యసాయి జిల్లాలో 11,194 మంది ఖాతాలకు రూ.11.19 కోట్లు జమ కానుంది. అనంతపురంలో కలెక్టర్ కార్యాలయంలో నేడు జిల్లా స్థాయి 'జగనన్న చేదోడు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

22 వరకు కలెక్టర్ సెలవు

అనంతపురం అర్బన్: కలెక్టర్ గౌతమి వ్యక్తిగత పనులపై ఈ నెల 22 వరకు సెలవులో వెళ్లారు. తిరిగి 23వ తేదీన విధులకు హాజరవుతారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

నేటితో ముగియనున్న ఈ- కేవైసీ గడువు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ-క్రాప్ చేయించుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ-కేవైసీ గడువు గురువారంతో ముగుస్తున్నందున ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఆర్బీకే అసిస్టెంట్లను కలిసి పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటీపీ ద్వారా కూడా ఈ-కేవైసీ చేసుకోవచ్చన్నారు.

ప్రసన్నాయపల్లిలో రూ.36 కోట్లతో అభివృద్ధి

- నవరత్నాల ద్వారా మరో రూ.30 కోట్ల మేర సాయం
- 'నాడు- నేడు' కింద పాఠశాలలో అభివృద్ధి పనులు
- జగనన్న కాలనీలో పేదలకు ప్లాట్లు
- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో నాలుగున్నరేళ్లలో ప్రసన్నాయపల్లి పంచాయతీలో రూ.36 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయ రామాంజనేయులు తెలిపారు. నవరత్నాల పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మరో రూ.30 కోట్ల మేర సాయం అందించామన్నారు. పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి – సంక్షేమం గురించి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ ఎంపీపీ రామాంజనేయులుతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యువజన విభాగం రాప్తాడు మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి వివరించారు. పంచాయతీ పరిధిలోని చిన్మయనగర్‌లో రూ.2.10 కోట్ల అహుడా నిధులతో రెండు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. నాడు–నేడు ద్వారా ప్రాథమిక పాఠశాలలో రూ.68 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.82 లక్షలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.60 లక్షల నిధులు ప్రజావసరాలకు ఖర్చు చేశామని, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.40 లక్షల నిధులు, మరో రూ.20 లక్షలు ఎమ్మెల్యే గ్రాంటు ద్వారా వెచ్చించామన్నారు. ప్రసన్నాయపల్లి గ్రామానికి చెందిన 350 మందికి రాప్తాడు జగనన్న కాలనీలో భూమి కొనుగోలు చేసి అందులో ఒకటిన్నర సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయించామన్నారు. ఇందులో దాదాపు 300 మందికి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. మరో రెండు నెలల్లో పంచాయతీలో మరో 369 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించి, ఇళ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. రాప్తాడు జగనన్న కాలనీలో ప్రసన్నాయపల్లి పంచాయతీ ముస్లింల కోసం మసీదు నిర్మాణానికి రూ.40 లక్షలు విలువ చేసే 10 సెంట్ల స్థలం, హిందువులకు రామాలయ నిర్మాణానికి రూ.36 లక్షలు విలువ చేసే 9 సెంట్ల స్థలం, క్రైస్తవుల చర్చి నిర్మాణానికి రూ.15 లక్షలు విలువ చేసే మూడున్నర సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. త్వరలోనే రూ.50 లక్షలతో ఎల్‌ఆర్‌జీ పాఠశాల ముందు తారు రోడ్డు నిర్మిస్తామన్నారు. ప్రజలకు ఉపయోగ పడాల్సిన గ్రామ సచివాలయ–2 భవన నిర్మాణ పనులు జరగకుండా రాజకీయ కక్షల ద్వారా కొందరు స్వార్థపరులు కోర్టుకెళ్లి అడ్డుకున్నారన్నారు. త్వరలోనే సచివాలయ భవన నిర్మాణ పనులు చేపడతామన్నారు.

పథకాల ద్వారా రూ.కోట్లలో లబ్ధి

ప్రసన్నాయపల్లి పంచాయతీ ప్రజలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా భారీ ఎత్తున లబ్ధి చేకూరిందని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న అమ్మ ఒడి, పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, జగనన్న చేదోడు, వైఎస్సార్ గోరు ముద్ద తదితర పథకాల ద్వారా లబ్ధిదారులకు కోట్ల రూపాయల ప్రయోజనం చేకూరిందన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్: అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో కదిరి, అనంతపురం డివిజన్ల పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఓవర్ లోడ్ సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు అవసరమైన నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని డివిజన్ ఇంజినీర్లను ఆదేశించారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌పై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. అప్పుడే వారికి ప్రభుత్వం అందించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత ఉంటుందన్నారు. చాలామంది అధికారులు ఆధార్ అనుసంధానంపై నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జిల్లాలో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు 1912టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే సకాలంలో సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేసే దిశగా విద్యుత్ అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ వసూళ్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీజీఎంలు గురవయ్య, ధర్మజ్ఞాని, ఎస్ఈ సురేంద్రతోపాటు ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఆస్పత్రి భవనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆస్పత్రి భవనం

అనంతపురం సెంట్రల్: అనంతపురం బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఆస్పత్రి నూతన భవనాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ప్రజాప్రతినిధులతో పాటు ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమల రావు తదితర ఉన్నతాధికారులు హాజరవుతారని వివరించారు. దాదాపు రూ.కోటి వ్యయంతో రూపుదిద్దుకున్న ఆస్పత్రి భవనంతో పాటు కార్గో పార్సిల్ కేంద్రాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. ఇక నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

40 శాతం రాయితీతో చాఫ్ కట్టర్స్



గడ్డి కత్తిరించే యంత్రాలు

అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు చాఫ్ కట్టర్స్ (గడ్డి కత్తిరించే యంత్రాలు) మంజూరు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ వై.సుబ్రహ్మణ్యం, ఫాడర్ డెవలప్‌మెంట్ విభాగం ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. వీటిని అర్హత కలిగిన పాడి రైతులకు 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తామన్నారు. తమ వాటా కింద ఆర్బీకేల్లో డబ్బు చెల్లించి దరఖాస్తు చేసుకున్న రైతులకు వారి గ్రామాలకే సరఫరా చేస్తామని చెప్పారు. రెండు హెచ్‌పీ సామర్థ్యం, మూడు బ్లేడులు కలిగిన ఒక్కో చాఫ్‌కట్టర్ పూర్తి విలువ రూ.33,970 కాగా అందులో 40 శాతం రాయితీ రూ.13,588 పోనూ రైతులు తమ వాటా కింద రూ.20,382 ప్రకారం చెల్లించాలన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 150 చాఫ్‌కట్టర్లను పంపిణీ చేశామన్నారు. పశుగ్రాసం వృథా కాకుండా చాఫ్ కట్టర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

75 శాతం సబ్సిడీతో జొన్న గడ్డి విత్తనాలు

ఇక పశువుల మేత సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఫాడర్ డెవలప్‌మెంట్ విభాగం ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరమైన రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు (ఫాడర్ సీడ్) ఆర్బీకేల్లో తమ వాటా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే వెంటనే పంపిణీ చేస్తామన్నారు. జొన్న రకం గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద కిలోకు రూ.23 ప్రకారం చెల్లించాలన్నారు. ఒక్కో రైతుకు 20 కిలోల వరకు ఇస్తామని తెలిపారు. ఖరీఫ్ కింద గత జూన్‌లో 126 టన్నులు పంపిణీ చేయగా... తాజాగా రబీ కింద 62 టన్నులు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా జాతర

గుమ్మఘట్ట: మండలంలోని గలగల, గొల్లపల్లి, కె.పి. కుంట గ్రామాల్లో దుర్గమ్మ, మారెమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పవిత్ర జలంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధులలో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. గొల్లపల్లి, గలగల గ్రామాలలో దుర్గమ్మ జాతరను పురస్కరించుకుని సిడిమానోత్సవం నేత్రపర్వంగా సాగింది. పూలతో అందంగా అలంకరించిన సిడికి పూజారిని కట్టి చుట్టూతిప్పుతుండగా అమ్మ వారి నామస్మరణతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గొల్లపల్లిలో సిడిమానోత్సవం



క్లుప్తంగా

కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి



రికార్డులు భద్రపరిచిన గదిని పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. అనంతపురం రూరల్ మండలం ఇటుకపల్లి పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఇతర సిబ్బందితో మాట్లాడుతూ.... దొంగతనాల కేసుల్లో చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. దొంగతనాలు చోటు చేసుకోకుండా నిఘా పటిష్టం చేయాలన్నారు. వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను వెనువెంటనే డిస్పోజల్ చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. మహిళలపై నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

వర్సిటీ టెన్నిస్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే లాన్‌టెన్నిస్ పోటీలకు జేఎన్‌టీయూ(ఏ) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రెటరీ బి.జోజిరెడ్డి పాల్గొన్నారు. ఎంపికైన వారిలో ఎస్.నరసింహయ్య (పీవీకేకే, అనంతపురం), ఎంఎస్‌వీ సాత్విక్ రెడ్డి (పీబీఆర్‌వీఐటీఎస్, కావలి), ఎం.కౌశిక్ సాయిరెడ్డి (పీబీఆర్‌వీఐటీఎస్, కావలి), పి. శరణ్‌కుమార్‌రెడ్డి (అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురం), ఆర్.సంజయ్‌కుమార్ (జేఎన్‌టీయూ సీఈ, పులివెందుల), బి. మానస (శ్రీ బాలాజీ పీజీ కళాశాల, అనంతపురం), ఎస్.హరిణి (ఎస్వీసీఈ, తిరుపతి), పి. ధనసాయి (జేఎన్‌టీయూ (ఏ), అనంతపురం), పి.శ్వేత (ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల) ఎ.ప్రవళిక (శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల) ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్



సమస్య విన్నవిస్తున్న అర్జీదారు



ప్రత్యేక స్పందన కార్యక్రమానికి హాజరైన జిల్లా స్థాయి అధికారులు

రాయదుర్గం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా గ్రామ స్థాయిలోనే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. రాయదుర్గంలోని డ్వామా ఏపీడీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అర్జీలను పరిశీలించారు. వివిధ సమస్యలపై 95 వినతులు అందగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు. జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం కేవలం సీఎం జగనన్న పాలనలోనే జరుగుతోందని కొనియాడారు.

పది రోజుల్లోపు పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన వినతులకు వారం, పది రోజుల్లోపు పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. నవంబర్ నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉంటుందన్నారు. పంచాయతీ స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, షటిల్ లాంటి ఐదు రకాల క్రీడలు నిర్వహించాలన్నారు. ఇందులో 15 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. దీని వల్ల రిజిస్ట్రేషన్ కోసం సుదూరంగా ఉన్న కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేదని, స్థానిక సచివాలయంలోనే అడ్మిన్ ద్వారా పూర్తి చేయించవచ్చునన్నారు. భూముల రీ సర్వే పూర్తయిన చోట సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, సీఈపీఓ అశోక్‌కుమార్, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహషాన్‌బాషా, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లానాయక్, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, డీటీడబ్ల్యూఓ అన్నాదొర, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, మెప్మా పీడీ విజయలక్ష్మి, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, డీఈఓ నాగరాజు, డీఎల్‌డీఓ శంకర్, తహసీల్దార్ మారుతి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండయ్య, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫలించిన 'విశ్వ' ప్రయత్నం

- పెన్నహోబిలం రథం తయారీకి రూ.2.30 కోట్లు మంజూరు



ఉరవకొండ: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ప్రయత్నం ఫలించింది. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం ఆలయ నూతన రథ నిర్మాణానికి భక్తులు అందజేసిన కానుకలను మ్యాచింగ్ గ్రాంట్ కింద కలుపుకుని ప్రభుత్వం రూ.2.30 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ అభివృద్ధితోపాటు నూతన రథం తయారీకి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విశ్వేశ్వరరెడ్డి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నూతన రథం నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు. దీనిపై విశ్వేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెన్నహోబిలం ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి రోజాను కలసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఎగ్జామినర్, డీఈ బాహాబాహీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థను అప్రతిష్టపాలు చేసేలా అధికారులు బాహాబాహీకి దిగారు. వివరాలు... నగరపాలక సంస్థలోని అధికారుల వాహనాలకు డ్రైవర్లను కేటాయించారు. ఆ డ్రైవర్ల హాజరును డీఈ రాంప్రసాదరెడ్డి చూస్తారు. ఎగ్జామినర్ వాహనానికి డ్రైవర్‌గా ఉన్న శంకర్ రెండ్రోజులుగా విధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన అబ్సెంట్ వేశారు. ఈ విషయాన్ని ఎగ్జామినర్ వెంకటరమణ దృష్టికి డ్రైవర్ శంకర్ తీసుకెళ్లాడు. తన డ్రైవర్ హాజరుకాని విషయంపై ఎలాంటి ఫిర్యాదు లేకున్నా అబ్సెంట్ ఎలా వేస్తారంటూ ఫోన్‌లో డీఈ రాంప్రసాద్‌రెడ్డిని ఎగ్జామినర్ వెంకటరమణ ప్రశ్నించారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అనంతరం నూతన భవనంలో ఉన్న ఎగ్జామినర్ చాంబర్‌కు వెళ్లిన డీఈ రాంప్రసాద్‌రెడ్డి ఆయన డోర్‌ను ఎగిసితన్నాడు. నీవెంత అంటే నీవెంత అనే ధోరణిలో అధికారులిద్దరూ బాహాబాహీకి దిగారు. అక్కడే ఉన్న కింది స్థాయి సిబ్బంది, కాంట్రాక్టర్లు నచ్చజెప్పి వివాదాన్ని సద్దుమణిగించారు. ఇదే విషయమై నగరపాలక సంస్థ ఎస్‌ఈ నాగమోహన్ మాట్లాడుతూ.. ఎగ్జామినర్ వెంకటరమణ మాటతీరు సక్రమంగా లేదని, డీఈపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. డ్రైవర్ గైర్హాజరవడంతోనే అబ్సెంట్ వేశారన్నారు. ఎగ్జామినర్ వెంకటరమణ వివరణ ఇస్తూ.. బిల్లుల పరిశీలన, క్లియరెన్స్ విషయంలో ముందు నుంచి డీఈ రాంప్రసాద్‌రెడ్డి వైఖరి సరిగా లేదని, ఇదే విషయమై పలుమార్లు హెచ్చరించడంతో ఆయన కక్ష సాధింపు చర్యలకు దిగారని వాపోయారు.

ఓపీ 8,123.. రెఫరల్ 385

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 28 ప్రాంతాల్లో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,123 మంది ఓపీ సేవలు పొందారు. వీరిలో 1,456 మంది వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్నారు. 385 మందిని జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు స్పెషలిస్టు వైద్యులు రెఫర్ చేశారు. అనంతపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం వేములపాడులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల, రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి పరిశీలించారు. గురువారం ఉదయం జిల్లాలోని 31 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. అనంతపురంలోని కోర్టు రోడ్డు, వినాయకనగర్‌తో పాటు చియ్యేడు, మదిగుబ్బ, శీర్పి, ఎలాంజి, బొమ్మగానిపల్లి, సిద్ధరాంపురం, కడలూరు, మారెంపల్లి, ఎస్.తిమ్మాపురం, హులికల్లు, కంబదూరు, హులికెర, చోళసముద్రం, కరిగానిపల్లి, పాళ్యంతండా, అప్పేచెర్ల, మరూరు, బీఎన్ హళ్లి, హవళిగి, కమలపాడు, శింగవరం, గుత్తి పంచాయతీ చెట్నేపల్లి, గుంతకల్లులోని భాగ్యనగర్, సత్యనారాయణపేట, రాయదుర్గం రాజీవ్‌గాంధీ కాలనీ, తాడిపత్రి అంబేడ్కర్ నగర్‌లో వైద్య శిబిరాలు ఉంటాయని వివరించారు.

నకిలీ సర్టిఫికెట్లపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఓరియంటల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్, హర్యానా స్టేట్ బోర్డు పేరుతో నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కోరారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లతో అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన బోర్డు జారీ చేసిన పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లతో పాటు దేశవ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి పొందిన 50 ఎస్ఎస్‌సీ బోర్డులు, 51 ఇంటర్ బోర్డులు జారీ చేసిన పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు మాత్రమే మన రాష్ట్రంలో చెల్లుబాటు అవుతాయన్నారు. నకిలీ సర్టిఫికెట్ల విషయంలో ఎలాంటి ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తప్పవని కోఆర్డినేటర్లను హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరి కోఆర్డినేటర్లతో స్వీయ ధ్రువీకరణపత్రాలు తీసుకున్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లాజర్, ఉమ్మడి జిల్లాల డీవైఈఓలు పద్మప్రియ, రంగస్వామి, అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో బ్యాచ్ రాక్షసానందం

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ మండిపాటు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేని ఎల్లో బ్యాచ్... సీఎం కుటుంబీకుల ఫొటోలను మార్ఫింగ్ చేసి రాక్షసానందం పొందుతోందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి టీడీపీ, జనసేన గ్యాంగ్‌లకు కలవరం మొదలైందన్నారు. ధర్మయుద్ధంలో సీఎంను ఎదుర్కొనే ధైర్యం లేక నైతికంగా దెబ్బతీసే కుట్రకు టీడీపీ పాల్పడుతోందన్నారు. సీఎం సోదరుల కుటుంబాల్లోని మహిళలు, రాజకీయాల్లో ఎక్కడా కనీస ప్రస్తావన లేని వారిని మనోవేదనకు గురి చేసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం బాధాకరమన్నారు. ఎల్లో బ్యాచ్ మృగాలకు కఠిన శిక్షతో పాటు సామాజిక బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ మోటార్ల చోరీ

విడపనకల్లు: తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చొరవ తీసుకుని రూ.1.40 లక్షల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు వెచ్చించి రెండు విద్యుత్ మోటార్లను సమకూర్చారు. జీబీసీ నుంచి నీటిని హవళిగి చెరువుకు ఎత్తిపోతల ద్వారా చేర్చేందుకు ఏర్పాటు చేసిన రెండు మోటార్లతో పాటు రెండు స్టార్టర్లు, 60 మీటర్ల పొడవైన కేబుల్, హెచ్‌డీ పైపులను దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై కరకముక్కల సర్పంచ్ రామాంజనరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పాల్తూరు పోలీసులు తెలిపారు.

అభాగ్యులకు అండగా ఆర్డీటీ

అనంతపురం క్రైం: అభాగ్యులకు అండగా నిలిచిన ఆర్డీటీకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని ఎస్పీ అన్బురాజన్ స్పష్టం చేశారు. అనంతపురంలోని షికారీ కాలనీలో ఆర్డీటీ సౌజన్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్‌తో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. షికారీ కాలనీలోని 55 కుటుంబాలకు చేయూతనందించారు. 14 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు, వాకింగ్ స్టిక్స్ అందజేశారు. 90 మంది మహిళలకు చీరలు, 80 మంది పురుషులకు షర్టులు, లుంగీలు, టవాళ్లు, 146 మంది చిన్న పిల్లలకు రెడీమేడ్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి, వికలాంగుల విభాగం డైరెక్టర్ రఫీ, రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఏటీఎల్ మల్లికార్జున, సీఐ జాకీర్‌హుస్సేన్, డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథచౌదరి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, దాతలు కళ్యాణ చక్రవర్తి, శివకుమార్, యోగేష్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్కేయూలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగం కొనసాగింపు

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని 2023-24 విద్యా సంవత్సరం వరకూ కొనసాగిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య తెలిపారు. ఏపీ పీజీసెట్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసిన విద్యార్థులు రెండో దఫా కౌన్సిలింగ్‌లో ఆప్షన్ పెట్టుకుని ఈ విభాగంలో చేరవచ్చునని పేర్కొన్నారు. కాగా, పీజీ సెట్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉన్నారు. అయితే అనాలోచితంగా కోర్సును రద్దు చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవడంపై ఉన్నత విద్యా మండలి ఆక్షేపణ తెలిపింది. అలాగే గత వారం రోజులుగా అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు కొనసాగాలని వర్సిటీలో ఆందోళనలు, రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. దీంతో ఉన్నత విద్యామండలి ఆదేశాలమేరకు ఈ ఏడాది కోర్సు కొనసాగింపునకు వర్సిటీ యాజమాన్యం ఆమోదం తెలిపింది.

టెక్ విద్యార్థులకు 'ఉపకారం'

- ప్రతిభావంత విద్యార్థుల ప్రగతికి ఊతం
- ఏఐసీటీఈ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల మంజూరు

అనంతపురం: మెరిట్ ఉన్నా ఆర్థిక పరిస్థితి సరిగా లేని కారణంగా చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చేయూత అందిస్తోంది. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న వారి కోసం ఉపకార వేతనాలను అందజేస్తోంది. ఇప్పటికే ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి కావడంతో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ఉపకార వేతనాలు మంజూరయ్యే అవకాశం ఉంది. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్ https://aicte@india.org/ లో తెలుసుకోవచ్చు. అర్హత ఉన్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ https://scholarships.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'ప్రగతి' పథంలో బాలికలు

సాంకేతిక డిగ్రీ, ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న బాలికల అభ్యున్నతికి సాయం అందించడమే 'ప్రగతి' పథకం లక్ష్యం. ఇంటర్మీడియట్/పదో తరగతి మార్కుల ఆధారంగా ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరం రెగ్యులర్ లేదా, లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరం చదువుతున్న అమ్మాయిలు అర్హులు. ఏఐసీటీఈ ఆమోదించిన విద్యా సంస్థలు, కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. గరిష్టంగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలికలకు ఉపకార వేతనం మంజూరు చేస్తారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల లోపు ఉండాలి. ఏటా 5 వేల మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారు. డిగ్రీ విద్యార్థులకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున గరిష్టంగా 4 సంవత్సరాలు అందిస్తారు. ఇందులో ట్యూషన్ ఫీజు కింద రూ.30 వేలు, కంటిన్‌జెన్సీ గ్రాంట్ కింద ఏటా (10 నెలలు) రూ.20 వేలు ఇస్తారు. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉన్న విద్యార్థులకు ల్యాప్‌టాప్, పుస్తకాలు, వాహనం వంటి వాటిని కొనుగోలు చేయడానికి రూ.30 వేలు ఇస్తారు.

దివ్యాంగులకు ఏఐసీటీఈ 'సాక్షం'

దివ్యాంగులను ఉన్నత విద్యలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏఐసీటీఈ ఏటా సాక్షం పేరుతో స్కాలర్‌షిప్ అందజేస్తోంది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.50 వేలు చొప్పున మంజూరు చేస్తారు. బీటెక్ విద్యార్థులకు గరిష్టంగా 4 సంవత్సరాలు, డిప్లొమో వారికి గరిష్టంగా మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్పు అందుతుంది. కళాశాల ఫీజు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు, పుస్తకాలు, పరికరాలకు వీటిని వెచ్చించాల్సి ఉంటుంది. వైకల్యం కనీసం 40 శాతం కన్నా ఎక్కువ ఉండాలి. కుటుంబ ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. సాక్షం కింద ఏటా అత్యధికంగా 5 వేల మందికి ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. డిప్లొమా లేదా డిగ్రీ కోర్సులను చదివే దివ్యాంగులు ఈ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

అనాథలకు దన్నుగా 'స్వనాథ్'

కరోనా మహమ్మారి కారణంగా వేలాది మంది పిల్లలు నిరాశ్రయులయ్యారు. తల్లిదండ్రులను కోల్పోయిన వారి చదువు, భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఇలాంటి పిల్లలకు ఉన్నత విద్యలో చేయూతనిచ్చేందుకు స్వనాథ్ పేరుతో ఏఐసీటీఈ కొత్త స్కాలర్‌షిప్‌ను 2021-22 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. కోవిడ్-19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన వారితో పాటు సాయుధ దళాలు, సెంట్రల్ పారామిలిటరీ దళాల్లో విధినిర్వహణలో అమరులైన జవాన్ల పిల్లలకు ఈ స్కాలర్‌షిప్ వర్తింపస్తుంది. ఏటా 2 వేల మందిని ఎంపిక చేస్తారు. ఇందులో వెయ్యి చొప్పున బీటెక్, డిప్లొమా విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఏటా రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్ మంజూరవుతుంది. అయితే అభ్యర్థి ఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లేదా ఏఐసీటీఈ సంబంధిత ఉపకార వేతనం పొంది ఉండకూడదు.

భర్తపై కత్తితో దాడి

- పోలీసుల అదుపులో నిందితురాలు

అనంతపురం క్రైం: క్షణికావేశంలో భర్తపై కత్తితో దాడి చేసిన మహిళ ఉదంతం అనంతపురంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన గొల్ల జయసూర్యారెడ్డి, ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం కుటుంబంతో సహా అనంతపురానికి వలసవచ్చిన జయసూర్యారెడ్డి.. కోవూరు నగర్‌లో నివాసముంటూ టవర్ క్లాక్ వద్ద ఉన్న ఓ మెడికల్ స్టోర్‌లో సేల్స్‌బాయ్‌గా పనిలో చేరాడు. ప్రమీల సైతం ఇంటి పట్టునే టైలరింగ్ చేస్తూ భర్తకు చేదోడుగా ఉండేది. అయితే చిన్నపాటి అంశానికి సైతం తీవ్రంగా ఉద్రేకపడే ప్రమీలకు మానసిక వైద్య నిపుణులతో చికిత్స అందజేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భోజనం ముగించుకుని పిచ్చాపాటి మాట్లాడుకుంటుండగా దంపతుల మధ్య వివాదం చెలరేగింది. ఆ సమయంలో తన చేతికి అందుబాటులో ఉన్న పదునైన కత్తితో భర్త తలపై ప్రమీల దాడి చేసింది. నడి నెత్తి మీది భాగం సగానికి పైగా చీలింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న నాల్గో పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు రాబట్టుకున్నారు. ప్రమీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బావపై కొడవలితో దాడి

కళ్యాణదుర్గం: ఆస్తి తగాదాల నేపథ్యంలో సొంత బావపైనే కొడవలితో దాడి చేసిన ఘటన కళ్యాణదుర్గం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం పరిధిలోని గుండ్లప్పదొడ్డి కాలనీకి కమ్మ హనుమంతరాయుడు, బ్రహ్మసముద్రం మండలం యనకల్లు గ్రామానికి చెందిన జంబుగుంపల బలరాం వరుసకు బావబామ్మర్దులు. వీరిద్దరి మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం కళ్యాణదుర్గానికి వచ్చిన బలరాం.. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా రాయదుర్గం రోడ్డులో ఉన్న హనుమంతరాయుడు తోట వద్దకు చేరుకోగానే ఇద్దరూ పరస్పరం తారసపడ్డారు. ఆ సమయంలో పాత కక్షతో రగిలిపోతున్న హనుమంతరాయుడు తన చేతిలో ఉన్న కొడవలితో బలరాంపై దాడి చేశాడు. తలకు బలమైన రక్తగాయమై కుప్పకూలిన బలరాంను వదిలి అక్కడి నుంచి పారిపోయాడు. అటుగా వస్తున్న వారు బలరాం దుస్థితిని గమనించి వెంటనే కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తరలించారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తేజోమూర్తి తెలిపారు.

పాల వ్యాపారి దుర్మరణం

ఉరవకొండ: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ పాల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం రాకెట్ల నివాసి రైతు విష్ణువర్ధన్ (31) పాల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం వ్యక్తిగత పనిపై చాబాలకు వెళ్లి ట్రాక్టర్ నడుపుతూ తిరుగు ప్రయాణమయ్యాడు. ఉరవకొండ శివారులోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో మలుపులో ట్రాక్టర్ బోల్తాపడింది. ఘటనలో విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దొంగను పట్టించిన మహిళ

అమరాపురం: అర్ధరాత్రి ఇంట్లో చొరబడిన దొంగను ఓ మహిళ చాకచక్యంగా బంధించింది. వివరాలు.. అమరాపురంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శారదమ్మ ఇంట్లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రవి ఇటీవల ఇంటికి తాళం వేసి తన సొంతూరు కదిరికి వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి తలుపులు తెరచి ఇంట్లోకి చొరబడ్డారు. బుధవారం వేకువజాము 3 గంటలకు మిద్దెపై నివాసముంటున్న శారదమ్మ మేల్కొని కింద ఇంట్లో నుంచి వస్తున్న శబ్దాన్ని గమనించి అక్కడకు చేరుకుంది. లోపలకు వెళ్లలేక బయటి నుంచి గట్టిగా ఎవరూ అంటూ కేకలు వేయడంతో అవతలి వ్యక్తి నమ్మబలికే ప్రయత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె వెంటనే ప్రధాన గేట్‌కు తాళం వేసి, ఇరుగు పొరుగు వారిని పిలిచింది. అక్కడకు చేరుకున్న ఉపాధ్యాయుడు ముద్దరంగప్ప, మరికొందరు లోపలకు వెళ్లి ఓ యువకుడిని పట్టుకున్నారు. విచారణలో తన పేరు రాజు అని, హాసన్ జిల్లా బేలూరుగా పేర్కొన్నాడు. తనతో పాటు మరో ముగ్గురు వచ్చారని వివరించాడు. ఘటనపై ఇన్‌చార్జ్ ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దసరా పండుగకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దసరా సందర్భంగా హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు మీదుగా యశ్వంత్‌పూర్-బీదర్, యలహంక-బీదర్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20న యశ్వంత్‌పూర్ జంక్షన్ నుంచి రాత్రి 11.15కు బయలుదేరిన రైలు (06521) మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు బీదర్ చేరుతుంది. తిరిగి ఈ రైలు (06522) 21వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. యశ్వంత్‌పూర్-బీదర్ రైళ్లు (06523/24) ఈ నెల 21, 22 తేదీల్లో అదే వేళల్లో నడపనున్నారు. 23వ తేదీ రాత్రి 11.30 గంటలకు యలహంక జంక్షన్ నుంచి బయలుదేరిన రైలు (06505) మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు బీదర్ రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. తిరిగి ఈ రైలు (06506) 24వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు యలహంకకు చేరుతుంది.

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

రాప్తాడు: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ద్విచక్ర వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. రాప్తాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేయబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆదేశాలతో వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.3 వేల డిపాజిట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న ముత్యాలమ్మ దేవత

రాప్తాడు: మండల కేంద్రంలోని గంగలకుంట రోడ్డులో వెలసిన ముత్యాలమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేకువజామున వేదపండితుల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహానికి పూజారి శీల్ల తిమ్మప్ప ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్, ఏఎస్‌ఐ ప్రతాప్ నాయక్

అనంతపురం సిటీ: రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే జీవితాంతం జైలు జీవితం అనుభవించాల్సి ఉంటుందని అనంతపురం ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్ హెచ్చరించారు. బుధవారం ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ప్రతాప్‌నాయక్‌తో కలసి రాజీవ్ కాలనీ, ఎర్నాల కొట్టాలలో ఆయన పర్యటించారు. ఆయా కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. రైల్వే ట్రాక్‌లపై రాళ్లు, కర్రలు పెట్టడం, రైళ్లపై రాళ్లు రువ్వడం వంటి చర్యలను రైల్వే శాఖ తీవ్ర నేరంగా పరిగణిస్తుందన్నారు. ఒక్కో రైలులో వందలాది మంది ప్రయాణిస్తుంటారన్నారు. ఇటువంటి తుంటరి చేష్టల కారణంగా ఏదైనా జరగరానిది జరిగితే ప్రాణనష్టం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. రైల్వే కేసుల్లో ఒక్కసారి ఇరుక్కుంటే జీవితాంతం వాటి చేదు ఫలితాలు అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తమ ఇళ్లల్లోని పిల్లలకు తెలియజేయాలని సూచించారు.


20, 21 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట దీక్షలు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20, 21వ తేదీల్లో కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేపడుతున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.నూర్యుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణి భూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, నాగభూషణ, మురళీకృష్ణ, రామాంజనేయులు, వెంకటేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దసరా సినీ సంగీత స్వరాభిషేకం'



అనంతపురం ఎడ్యుకేషన్: సంగీత ప్రియులను అలరించేందుకు 'అనంత ఉపాధ్యాయ కళాసమితి' ఆధ్వర్యంలో మరో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో గురువారం సాయంత్రం 6 గంటలకు 'దసరా సినీ సంగీత స్వరాభిషేకం' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బాలమురళీ కృష్ణ, ఉపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు. ఉపాధ్యాయ గాయకులు సినిమా పాటలను పాడి అలరిస్తారని పేర్కొన్నారు.

జగజ్జననికి జేజేలు



సుభాష్ రోడ్డులోని అర్బన్‌బ్యాంక్ సమీపంలో కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారంలో దుర్గామాత

అనంతపురం కల్చరల్/ఆత్మకూరు: జగమేలే జగజ్జననికి జేజేలు పలుకుతూ భక్తజనం నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం సుభాష్ రోడ్డులోని అర్బన్ బ్యాంకు సమీపంలో దుర్గామాతను కరెన్సీ నోట్లతో అలంకరించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలచిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పాతూరు అమ్మవారి శాలలో వన విహారిణిగా వాసవీ మాత పూజలందుకుంది. ఆలయమంతా సర్వాంగ సుందరంగా ప్రత్యేకంగా కూరగాయలు, పళ్లతో అలంకరించి పూజలు చేపట్టారు. కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శివశంకరిగా కొలువుదీరారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవిగా, రెండో రోడ్డులోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో ఏకాదశ మహన్యాస పూర్వక అభిషేకాలు, చండీ హోమం, గ్రామోత్సవం జరిగాయి. బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. శంకరమఠంలో శారదాదేవి గరుడ వాహనంపై భక్తులను కరుణించారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, బాలయోగి ఆశ్రమం తదితర చోట్ల అమ్మవారు మహాలక్ష్మీగా దర్శనమిచ్చారు. అలాగే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పాల్గొనారు. నృత్యం చేసిన చిన్నారులను అభినందించారు. అనంతరం ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేసి, సన్మానించారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలోని సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆత్మకూరులోని కన్యకా పరమేశ్వరిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు.



శారదా శంకరమఠంలో గరుడ వాహనంపై శారదామాత



మున్సిపల్ కాంప్లెక్స్‌లో లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



కూరగాయల అలంకరణలో పాతూరు అమ్మవారు



మొదటి రోడ్డు శివాలయంలో చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



కొత్తూరు అమ్మవారికి పట్టు చీరలు ఇస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం దంపతులు, ఆర్యవైశ్య నాయకులు రాము, నరసింహులు



రెండో రోడ్డులోని చంద్రశేఖరేంద్ర పీఠంలో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



ఆత్మకూరులో పూజలందుకున్న వాసవీ మాత



గవ్వల అలంకరణలో రేణుకా యల్లమ్మ



చౌడేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణగా దర్శనమిచ్చిన ముత్యాలమ్మ



సత్యనారాయణ స్వామి ఆలయంలో కామాక్షి అలంకారంలో రమాదేవి

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వైద్య సదుపాయం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: 'పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. ఆ మహానేత కుమారుడు మరో రెండు అడుగులు ముందుకేసి ఆరోగ్యశ్రీ ద్వారా 3,256 చికిత్సలకు ఉచితంగా వైద్యం అందించేందుకు చొరవ తీసుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకూ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా కార్పొరేట్ వైద్యం అందించేలా చర్యలు తీసుకుందని' ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, పాతూరు కస్తూరిబా పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరాలకు వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం వైద్య రంగం బలోపేతానికి తీసుకున్న చర్యలు, ఆరోగ్యశ్రీ ద్వారా ఎటువంటి సేవలు పొందుతామో ప్రజలకు వివరించారు. ఆరోగ్యశాఖ సిబ్బంది సైతం శిబిరాలకు వచ్చిన ప్రజలకు ఆరోగ్యశ్రీ ప్రాముఖ్యతను తెలియజేశారు. నగరంలో 42 ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ (ప్రభుత్వ, ప్రైవేట్) ఆస్పత్రులున్నాయన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సర్పంచ్ ఉదయ్, ఉప సర్పంచ్ సుమిత్ర, కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఓ వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఇంటి వద్దకే వైద్యం



40 ఏళ్లుగా అనంతపురంలోనే ఉంటున్నాం. ఇప్పటి దాకా ఇంటికి వచ్చి ఆరోగ్యం ఎలా ఉందని అడిగినోళ్లు లేరు. ఓట్ల కోసమే వచ్చేటోళ్లు. అటువంటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులే ఇళ్ల వద్దకు వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పరీక్షలు చేశారు. గొంతులో గడ్డ ఉందని, క్యాంపుకు రావాలని చెప్పారు. ఎక్కడా ఈ విధంగా సేవలందించిన పరిస్థితి లేదు. సీఎం జగన్ సర్‌కు ధన్యవాదాలు.

– కొండమ్మ తిలక్‌రోడ్డు, పాతూరు

ప్రభుత్వ సేవలు భేష్



ఇంటి వద్దకు వచ్చి వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరం రోజున రావాలని చెప్పడంతో ఇక్కడకు వచ్చాం. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే మాలాంటి మధ్యతరగతి వారికి ఇబ్బందే. అటువంటిది ఉచితంగా సేవలందిస్తున్నారు. ముఖ్యంగా కంటి సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. మామూలుగా అయ్యింటే పెద్దాస్పత్రి, ఇతర ఆస్పత్రులకు ఎప్పుడు వెళ్తాం. ఇంటికి సమీపంలోనే క్యాంపు ఏర్పాటు చేశారు. జగనన్న ప్రభుత్వం మంచి చేస్తోంది.

– సునీత గృహిణి, నీరుగంటి వీధి

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్



ఇన్‌చార్జి తహసీల్దార్ రామాంజనేయులు ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో వైఎస్సార్ సీపీ నాయకులతో గ్రామానికి చెందిన భూమిరెడ్డి మహానంద రెడ్డి, తిరుపాల్ రెడ్డి వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ ఆంజనేయులు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రామాంజినేయులు ఎదుట ముందస్తు చర్యగా ఇద్దరిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లను ఆరు నెలలకు ఒకసారి బైండోవర్ చేస్తుంటామన్నారు. అందులో భాగంగానే రౌడీషీటర్ భూమిరెడ్డి మహానంద రెడ్డి, అతడి అనుచరుడు, డబుల్ మాంగర్ తిరుపాల్ రెడ్డిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

చెన్నేకొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు మేలు జరుగుతోందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. బుధవారం గంగినేపల్లిలో జరిగిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఎన్‌ఎస్.గేట్ పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. రక్త పరీక్షలు బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ నాయక్, సర్పంచ్‌లు, శాంతమ్మ, నవీన బాయి తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లిలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు వైద్య శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వేణుగోపాల్ నగర్, కోర్టు రోడ్డులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 5, 28వ సచివాలయాల పరిధిలోని షిరిడీ నగర్, వేణుగోపాల్‌నగర్, తారకాపురం కొట్టాలు, బాబా నగర్, రహమత్‌నగర్ ప్రాంత వాసులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు మదిగుబ్బలో..

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్, సర్పంచ్ నరసింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓబుళంపల్లిలో..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో గురువారం జగనన్న సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. బసంపల్లి ఓబుళంపల్లి పంచాయతీల్లోని గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మరూరులో..

రాప్తాడు: మండలంలోని మరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు జువాలజీ విభాగంలో ఇంటర్వ్యూలు

అనంతపురం: అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీలో భాగంగా గురువారం జువాలజీ విభాగంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి తెలిపారు. సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హత చెందిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10:30 గంటలకు రెజ్యూమ్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ సర్టిఫికెట్లను తమ వెంట తీసుకుని రావాలన్నారు.

మార్మోగుతున్న గోవింద నామస్మరణ



హనుమద్ వాహనంపై కొలువుదీరిన శ్రీవారు

అనంతపురం కల్చరల్: తిరుమలను తలపిస్తూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని శ్రీనివాసనగర్, హౌసింగుబోర్డుల్లని వేంకటేశ్వరాలయాలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సాగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడై వేంకటేశ్వరుడు హనుమద్ వాహనంపై విహరించి పూజలందుకున్నాడు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన అర్చక బృందం, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎన్‌వైకే డీడీఓ శ్రీనివాసులు

రాప్తాడు: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని నెహ్రూ యువకేంద్రం డీడీఓ శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, జయమారుతి, ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నా మట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా అమృత్ కలశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్. శర్మ, చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

నేడు సామూహిక కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉన్న వలీస్వామి ఆశ్రమంలో గురువారం ఉదయం 9 గంటలకు 108 మంది ముత్తయిదువలకు కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి వడిబియ్యం సమర్పణ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న వారు ముందుగా ఆశ్రమానికి విచ్చేయాలని సూచించారు.

డీ5 సబ్ స్టేషన్ ఏఈగా ప్రసాద్

అనంతపురం టౌన్: నగరంలోని డిస్ట్రిబ్యూషన్-5 సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఏఈగా ప్రసాద్‌ను నియమిస్తూ విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సీడీ ఆస్పత్రిలో వైద్యం సూపర్

'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ పట్టింది. అందుకు నిలువెత్తు సాక్ష్యమే నగరంలోని పాతూరు సీడీ ఆస్పత్రి. గత 40 ఏళ్లుగా బ్రిటిష్ కాలం నాటి భవనంలోనే సీడీ ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నా బార్డు నిధులు రూ.11.02 కోట్లతో సీడీ ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా మౌలిక వసతులు కల్పించడంతో వైద్య సేవల కోసం ప్రజలు బారులుతీరుతున్నారు. ఓపీ వైద్యులు, తదితర సిబ్బంది నాణ్యమైన సేవలు అందిస్తుండటంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్



ఓపీ స్లిప్ తీసుకునేందుకు క్యూ లైన్‌లో ఉన్న ప్రజలు



ఓ వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు

పోలేరమ్మ ఆలయానికి విరాళం



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, తదితరులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలోని పోలేరమ్మ గుడి దూపదీప నైవేద్యాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పోలేరమ్మ ఆలయ పరిస్థితిని వివరించారు. ఈక్రమంలో ఆలయానికి రూ.10 వేల విరాళం ఇస్తానని ప్రకటించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, వీఆర్‌ఓ గోవిందనాయక్, వార్డు సభ్యుడు పుల్లన్న చేతుల మీదుగా పోలేరమ్మ గుడి పూజారి చంద్రాయుడుకు నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హోతూరు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది.

అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.



బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తోందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్ణిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు.



ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు. సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికి వాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిల్బుట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షాలిక్, 76 సంవత్సరాల రహేల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షాలిక్, అనారోగ్యంతో ఉన్న రహేల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



• మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి దిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



• రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.

ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

• కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.







కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్ప కూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జిత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాదీ'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.